

కర్ణాటక దంపతులకు బాలిక దత్తత

ఏలూరు: కర్ణాటక రాష్ట్రానికి చెందిన పిల్లలు లేని దంపతులకు ఏలూరులోని శిశు గృహంలోని బాలికను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమక్షంలో దత్తత ఇచ్చారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 16 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికను కర్ణాటకకు చెందిన హరీష్, పుష్ప దంపంతులకు అందించారు. ఈ సందర్భంగా దత్తత ధృవపత్రాలను వారికి కలెక్టర్ అందజేశారు. ఆ దంపతులకు 2020లో బాలిక కోసం దరఖాస్తు చేసుకున్నారు. హరీష్ పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. పుష్ప గృహిణిగా ఉన్నారు. పెద్ద పిల్లలను దత్తత పొందువారు తగు జాగ్రత్తలు పాటించి పిల్లలను జాగ్రత్తగా పెంచాలని కలెక్టర్ సూచించారు. వారిపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమన్నారు. చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలు దత్తత వెళ్లేందుకు ఇష్టపడిన వారిని కారా నియమనిబంధనల ప్రకారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారి ఆర్డర్ల ద్వారా దత్తత ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.పద్మావతి పాల్గొన్నారు.

రసవత్తరం.. 'చింతలపూడి' రాజకీయం..!

టిక్కెట్ కోసం పదుల సంఖ్యలో నేతల పోటీ
అధికారపార్టీలో అంతర్గత పోరు
సిట్టింగ్‌కు నోఛాన్స్..!
గెలుపుగుర్రం కోసం ప్రతిపక్షం సర్వే



ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చింతలపూడి నియోజకవర్గ రాజకీయాలు వేడెక్కాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు గెలుపుగుర్రాలనే రంగంలోకి దించాలనే ఉద్దేశంతో ముందుకుసాగుతున్నాయి. ఈ క్రమంలో సిట్టింగ్ ఎంఎల్‌ఎను సైతం మార్పుచేసే ఆలోచనలో అధికారపార్టీ ఉంది. దీంతో ఆ పార్టీలో గ్రూపు విబేధాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పోటీలో బలమైనా అభ్యర్థులుంటేనే గెలుపు సాధ్యమని, అలాంటివారినే బరిలోకి దింపుతామని ఆయా పార్టీల అధినేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోనే అతిపెద్ద నియోజకవర్గమైన చింతలపూడిలో ప్రస్తుత రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఈ నియోజకవర్గం గతంలో టిడిపికి కంచుకోటగా ఉండేది. 2019 ఎన్నికల్లో వైసిపి ఆ కోటను బద్దలుకొట్టింది. ప్రస్తుతం టిడిపి, జనసేన కలిసి, వైసిపి ఒంటరిగా పోటీ చేస్తోంది.

వైసిపిలో అంతర్గత పోరు!

వైసిపి అధిష్టానం రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్ప చేస్తోంది. ఈ క్రమంలో చింతలపూడి వైసిపి ఇన్‌ఛార్జిని కూడా మార్చే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఇన్‌ఛార్జి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా గ్రూపు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గం నుంచి భారీ ర్యాలీగా వెళ్లి మంత్రి మిథున్‌రెడ్డిని కలిసి ఎలిజాకే మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉంటే ఎంఎల్‌ఎ ఎలిజా సైతం ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూలో తనను కొందరు బెదిరిస్తున్నారని, తనపై అధిష్టానం వద్ద తప్పుడు ప్రచారం చేస్తున్నారని, త్వరలో వారిపేర్లు బయటపెడతానని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నియోజకవర్గానికి చెందిన 12 మంది పెత్తందారులు బెదిరిస్తూ, పెత్తనం చలాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. తనను ఎంఎల్‌ఎ అభ్యర్థిగా మరోసారి ప్రకటిస్తే తప్పకుండా ఓడిస్తామని ఆ 12 మంది హైకమాండ్ వద్ద చెప్పినట్లు ఎలిజా వివరించారు. ఇలాంటి ప్రచారం వల్ల నియోజకవర్గంలోని వైసిపి నాయకుల, కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయని, బెదిరింపులు ఇలాగే కొనసాగితే వారిపేర్లు బహిరంగంగా బయటపెడతామని హెచ్చరికలుసైతం ఎలిజా చేశారు.

అదే విధంగా మరో గ్రూపు నాయకులు మాత్రం ఎలిజ గెలిచినప్పటి నుండి తమను పట్టించుకోలేదని, సీనియర్లను కనీసం పట్టించుకోకుండా, పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టారని ఆరోపిస్తున్నారు. టిడిపి నుండి వైసిపిలోకి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యతిస్తున్నారని, కనీసం తమ బాధలు, కష్టాలు, ఇబ్బందులు పట్టించుకోలేదని, ఇప్పుడు టిక్కెట్ ఇవ్వకపోవడంతో తమపై బురదజల్లుతున్నారని, సర్వేలు, రిపోర్ట్ ఆధారంగానే అధిష్టానం ఇన్‌ఛార్జిని నియమిస్తున్నారని చెప్పుకొస్తున్నారు.

వైసిపి ఇన్‌ఛార్జిగా కంభంపాటి విజయరాజు..!

కామవరపుకోటకు చెందిన కంభంపాటి విజయరాజును నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నట్లు సమాచారం. రవాణాశాఖ అధికారిగా పనిచేస్తున్న ఆయన అప్పటికే తన ఉద్యోగానికి రాజీనామా కూడా చేశారు. నియోజకవర్గంలోని నాయకులను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. ఖచ్చితంగా గెలుస్తామనే నమ్మకంతో ముందుకు వెళున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. గత ఎన్నికల్లోనే ఆయన వైసిపి నుండి టిక్కెట్ ఆశించారు. ఈసారైనా వస్తుందనే ధీమాతో ఆయన ఉన్నారు. విజయరాజు వియ్యంకుడు శాసన మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు సహకారం కూడా ఆయనకు ఉండటంతో టిక్కెట్ వచ్చే అవకాశం ఉందని ఆయన గ్రూపు నేతలు చెబుతున్నారు. అలాగే హోంమంత్రి తానేటి వనిత పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇక్కడ విజయానికి అన్ని విధాలుగా ఆలోచించి, బలమైనా అభ్యర్థిని రంగంలోకి దింపాలని అధిష్టనం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

అదే విధంగా ఎన్ఆర్ఐ ముప్పిడి సుశీల్‌కు ఎంపీ మిథున్ రెడ్డితో మంచి సంబంధాలున్నాయి. దీంతో ఆయనకూడా టిక్కెట్ ఆశిస్తున్నవారిలో ఉన్నారు. చింతలపూడి జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, కామవరపుకోట కడిమి రమేష్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధిష్టానం సర్వే చేయించి బలమైనా అభ్యర్థిని నిలబెట్టే యోచనలో ఉంది.

టిడిపి అభ్యర్థి ఎవరు?

ప్రతిపక్ష టిడిపి నుంచి టిక్కెట్ ఆసిస్తున్నవారి లిస్టు పెద్దగానే ఉంది. వైసిపి విజయరాజుకి ఇస్తే, టిడిపి నుంచి మద్దాల రాజేష్ గానీ, మాజీ మంత్రి పీతల సుజాతకు ఇచ్చే యోచనలో టిడిపి ఉన్నట్లు సమాచారం. అదేవిధంగా బొమ్మాజి అనిల్, సొంగా రోషన్ కుమార్, ఆకుమర్తి రామారావు పేర్లు కూడా టిడిపి అభ్యర్థుల జాబితాలో ఉన్నాయి. వీరిలో రోషన్‌కుమార్‌కు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆయన గ్రూపు నాయకులు చెబుతున్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న బొమ్మాజి అనిల్‌కు తనదైన శైలిలో టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. యువగళం పాదయాత్రలో టిడిపికి మంచి క్రేజ్‌ను తీసుకురావడంలో అనిల్ కృషి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఈసారి పీతల సుజాతకే..!

ఈసారి టిక్కెట్ పీతల సుజాతకు ఇచ్చే యోచనలో టిడిపి అధిష్టానం ఉన్నట్లు తెలిసింది. 2019లో టిక్కెట్ ఆశించి భంగపడినా, అధిష్టానం నిర్ణయాన్ని కాదనలేదు. అప్పటి నుండి ఆమె పార్టీలో కొనసాగుతూ నియోజకవర్గంలో, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గాపాల్గొంటూ వస్తున్నారు. 2014లో కాపు సామాజిక తరగతికి పెద్దపీట వేసి బలమైనా నాయకులను తయారుచేసిన ఘనత ఆమెకే దక్కింది. టిడిపి జనసేనపొత్తులో భాగంగా నియోజకవర్గంలో కాపు ఓటింగ్ కూడా ఎక్కువగా ఉండటంతో ఆమెకు కలిసివచ్చే అంశం. చింతలపూడి, కొవ్వూరు, తిరువూరు నియోజకవర్గాల్లోనైనా టిక్కెట్ ఇచ్చే యోచనలో టిడిపి ఉన్నట్లు సమాచారం.

అదేవిధంగా జంగారెడ్డిగూడేనికి చెందిన ఆకుమర్తి రామారావు కూడా రేసులో ఉన్నారు. ఆయన చేసిన సేవలు కూడా పరిగణలోకి తీసుకుని టిక్కెట్ ఇస్తే ఎలా ఉంటుందోనని అధిష్టానం చర్చిస్తున్నట్లు తెలిసింది.

ప్రజలు పునరాలోచించాలి

రానున్న ఎన్నికల్లో టిడిపికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలి
టిడిపి అధినేత చంద్రబాబునాయుడు



మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - భీమవరం/ఆచంట

'చల్లని సాయంత్రం, ఆహ్లాదకరమైన వాతావరణం.. ఎటు చూసినా పచ్చని పొలాలు దేశానికి అన్నంపెట్టిన అన్నపూర్ణ పశ్చిమగోదావరి జిల్లా అని, ఈ జిల్లా అంటే తనకు ఎనలేని అభిమానమని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. 2014 ఎన్నికల్లో 15 అసెంబ్లీ, మూడు పార్లమెంట్ స్థానాలు టిడిపికి ఇచ్చారని, రానున్న ఎన్నికల్లో టిడిపికి పూర్వ వైభవాన్ని మళ్లీ తీసుకొచ్చేందుకు పశ్చిమ ప్రజలు పునరాలోచించాలని కోరారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆచంటలో నక్కల కాలువ సమీపాన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అధ్యక్షతన 'రా.. కదలిరా' బహిరంగ సభను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చంద్రబాబు సాయంత్రం 4.05 గంటలకు హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో రోడ్డు మార్గాన బయలుదేరారు. రామేశ్వరస్వామిని దర్శించుకుని సభా ప్రాంగణానికి 5.19 నిమిషాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పితాని సత్యనారాయణ అధ్యక్షత వహించగా చంద్రబాబు మాట్లాడారు. మంచికి, అతిథి మర్యాదలకు మారు పేరు పశ్చిమ జిల్లా అని అన్నారు. ఆచంట నుంచే జై విజయయాత్ర ప్రారంభిస్తున్నామని చెప్పారు. టిడిపియే కాకుండా జనసేన అంటే కూడా ఈ జిల్లాలో అభిమానం ఎంతో ఉందన్నారు. వైసిపి సినిమా అయిపోయిందని, త్వరలో వారంతా బయటకు పోతారన్నారు. జిల్లాలో ఏ ఒక్క రోడ్డూ నిర్మించలేదని, కాలువలు, డ్రెయినేజీల పూడిక తీయలేదన్నారు. వ్యవసాయాన్ని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. వరి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. రైతులకు, కౌలు రైతులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ధాన్యం కొనుగోలుకు కనీసం గోనె సంచులు కూడా ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వమని విమర్శించారు. దిక్కుతోచని స్థితిలో రైతులు క్రాప్ హాలీడే ప్రకటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే రైతు రాజ్యం తీసుకొస్తామన్నారు. పోలవరాన్ని పూర్తి చేసి నదులను అనుసంధానం చేసి మూడు పంటలకు నీరు అందిస్తామన్నారు. వరి రైతులు, కౌలు రైతులు, అన్ని వర్గాల ప్రజలు 90 రోజులు కష్టపడితే స్వర్ణయుగం తీసుకొస్తానని చెప్పారు.

జిల్లాలో అసమర్థ మంత్రులు, ఎంఎల్‌ఎలు

జిల్లాలో వైసిపికి చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు అసమర్థులని, వారి సొంత ప్రయోజనాలు తప్ప ప్రజల కష్టాలు పట్టవని చంద్రబాబు విమర్శించారు. తణుకులో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఉన్నారని, సొంత జిల్లాలోనే రైతులకు ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు ఇవ్వని అసమర్థ మంత్రి అన్నారు. రాష్ట్రంలోని టిడిఆర్ బాండ్ల కుంభకోణం తణుకు నుంచే జరిగిందని, దీనిని రాష్ట్రమంతా వైసిపి అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఏది నిర్మించాలన్నా ఐదు శాతం కమీషన్ ఇవ్వాలని ఆ మంత్రి నిబంధన విధించారన్నారు. తాడేపల్లిగూడేనికి చెందిన మరొక మంత్రి కొట్టు సత్యనారాయణ ఏకంగా చిల్లర కొట్టే పెట్టారన్నారు. అన్నిచోట్లా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. సభలో జనసేన జిల్లా అధ్యక్షులు గోవిందరావు, నేతలు బొమ్మిడి నాయకర్, జుత్తిగ నాగరాజు, చేగొండి సూర్యప్రకాష్, బొలిశెట్టి శ్రీనివాస్, విడివాడ రామచంద్రరావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

అధికారులకు జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి జిల్లాలో జిల్లా ప్రజాపరిషత్ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం శాఖల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో జిల్లా ప్రజా పరిషత్ నిధులతో చేపట్టిన పనులపై సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను ఎన్ఆర్ఇజిఎస్, 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టాల్సిన 604 రకాల పనుల్లో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి పంచాయతీ రాజ్ మూడంచెల వ్యవస్థలో కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. ఇప్పటి వరకూ జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని, మొదలుపెట్టని పనులను సత్వరం ప్రారంభించి ఎన్నికల నియమావళికి ముందుగానే పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి కెఎస్ఎస్.సుబ్బారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షన ఇంజనీర్ ఎంవివి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామస్వామి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం నుండి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రమాకాంతరావు, శ్రీనివాస్, రమణమూర్తి డిప్యూటీ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

మందులపై జిఎస్‌టిని ఎత్తివేయాలి

మెడికల్ రిప్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ కృష్ణయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మందులపై జిఎస్‌టిని ఎత్తివేయాలని, మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్‌లకు కార్మిక చట్టాలు అమలుచేసి కనీస వేతనం ఇవ్వాలని ఎపి మెడికల్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ యువి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పవర్‌పేటలోని సిఐటియు కార్యాలయంలో బి.సత్యనారాయణ అధ్యక్షతన యూనియన్ వార్షిక మహాసభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిఎస్‌టి పేరుతో అన్ని రకాల వస్తువులపై పన్నులు పెంచిందని విమర్శించారు. మందులపై కూడా కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిని విధించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఫార్మా సంస్థలు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఫార్మారంగంలో పనిచేస్తున్న మెడికల్ రిప్స్‌కు కార్మిక చట్టాలను వర్తింపజేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేసే విధంగా ఫార్మా కంపెనీలకు ఉత్తర్వులివ్వాలని కోరారు. సిఐటియు నగర నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారాలు మోపుతున్నాయని విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, అసంఘటితరంగ కార్మికులు వారి నిజ వేతనాలు తగ్గి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీలు, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, తదితర ఉద్యోగులంతా సమ్మెబాట పట్టారని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బివివి.సత్యనారాయణ, కార్యదర్శిగా మొహిద్దీన్, కోశాధికారిగా వై.దుర్గారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.కిరణ్‌కుమార్, పి.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా సీతయ్య, ఉమామహేష్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా చెన్నకేశవ, కె.శివ, కార్తీక్, నిర్వాహకులుగా ఎంఎల్ఎన్.నరసింహన్, వెంకట్రావు వ్యవహరించారు. ఏలూరు బ్రాంచిలో సేవలందించిన సీనియర్ ఉద్యోగిని సాలువాతో యూనియన్ సభ్యులందరూ సత్కరించారు.

ఎస్మా ప్రయోగం సిగ్గుచేటు

27వ రోజుకు అంగన్వాడీల సమ్మె
ఎస్మా కాపీలు దహనం చేసి నిరసన
నిడమర్రులో రాస్తారోకో

ప్రజాశక్తి - విలేకరులు

జిల్లాలో అంగన్వాడీల సమ్మె శనివారానికి 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయకుండా విచ్ఛిన్నానికి ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరించడం సిగ్గుచేటని ఈ సందర్భంగా అంగన్వాడీలు విమర్శించారు.


ఏలూరులో..

ఏలూరు అర్బన్: ఎస్మాను ప్రయోగించి అంగన్వాడీల సమ్మెను విచ్చిన్నం చేయాలని చూస్తే సహించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన 24 గంటల రిలే నిరాహార దీక్ష కొనసాగింది. అలాగే స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎస్మా జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడం చేతగాక వారిపై ఎస్మా ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. సమ్మె ప్రారంభించిన 27 రోజులకు రాష్ట్ర ప్రభుత్వానికి అత్యవసర విభాగమని గుర్తుకొచ్చిందా అని ఎద్దేవా చేశారు. కేవలం అంగన్వాడీలను భయపెట్టేందుకే నల్ల చట్టాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న కాలంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల దీక్షకు యుటిఎఫ్ జిల్లా నాయకులు ఆర్.రవికుమార్, శ్యాంబాబు, రంగమోహన్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఉపాధ్యక్షులు కె.విజయలక్ష్మి, పి.భారతి, వి.సాయిబాబు, బి.జగన్నాథం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ, అంగన్వాడీల యూనియన్ జిల్లా నాయకులు స్వప్న, ఏలూరు ప్రాజెక్టు కార్యదర్శి దుర్గాభవాని, తిరుపతమ్మ, బేబీ రాణి, లక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మాను వెనక్కితీసుకోవాలని రాష్ట్ర జెఎసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ఎస్.హరనాథ్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. వేతనాలు పెంచాలని 27 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని, సమస్యలు పరిష్కరించకుండా ఇలాంటి విధానాలు అవలంబించడం అంగన్వాడీలను రెచ్చగొట్టడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎస్మాను రద్దు చేయాలని నిరసన

అంగన్వాడీల హక్కులను హరించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మాను రద్దు చేయాలని కోరుతూ ఏలూరు మార్కెట్ యార్డ్ దిగుమతి,ఎగుమతి కార్మికుల సంఘం(ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో ఆదివారం వివి.నగర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కోసం, జీతభత్యాల పెంపుకోసం పోరాడుతున్న అంగన్వాడీలను బెదిరించడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కాకుంటే ధర్నాలు, రాస్తారోకోలు, పికెటింగ్‌లు, సమ్మె వంటి ఉద్యమాలు చేపడతారని, ఆ కోణంలో ప్రభుత్వాలు ఆలోచన చేసి సమస్యలు పరిష్కారం కోసం ముందుకు రావాలే తప్ప దుర్మార్గంగా ఎస్మా వంటి చట్టాలను తీసుకొచ్చి కార్మిక హక్కులను హరిస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించినారు. ఈ కార్యక్రమంలో గడసాల రమణ, కొండ, పండు, దానియేలు, విజయ్, పార్వతి, పూర్ణమ్మ, సరస్వతి, భాగ్యం, రావులమ్మ, పద్మ, సింహాచలం, క్రాంతి పాల్గొన్నారు.


నూజివీడులో..

నూజివీడు రూరల్ : స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె 27వ రోజూ కొనసాగింది. అంగన్వాడీల పోరాటాన్ని నిర్వీర్యం చేసేందుకు విడుదల చేసిన ఎస్మా జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు మాట్లాడుతూ అంగన్వాడీలను బెదిరించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో జి.రాజు, ఆదిలక్ష్మి, లక్ష్మీకాంతం, రమాదేవి పాల్గొన్నారు.


నిడమర్రులో..

చింతలపూడి : అంగన్వాడీల సమ్మెకు సిఐటియు, యుటిఎఫ్ నేతలు మద్దతు తెలిపారు. పట్టణంలో చేపట్టిన సమ్మె శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం అంగన్వాడీల ఉద్యమ నిధికి యుటిఎఫ్ మండల శాఖ తరపున రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు అప్పారావు, మండల అధ్యక్షులు దామోదర్, నాయకులు, ప్రేమ్ కుమార్, బుచ్చిబాబు, చెంచెంరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చాట్రాయి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజూ కొనసాగింది. ఈ కార్యక్రమానికి శివకుమారి, రాజ్యలక్ష్మి, విజయ, మంగతాయారు నాయకత్వం వహించారు.

కలిదిండి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎస్మా జిఒ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లా డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, మండల కార్యదర్శి ఎస్.మహాలక్ష్మి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్వాడీల యూనియన్ నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ మండలంలోని అంగన్వాడీలు జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నాగమణి, ఎస్తేరు, సరళ, జ్యోతి పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని అంగన్వాడీలు ఎస్మా చట్టం జిఒ కాపీలను దహనం చేశారు. అంగన్వాడీల సమ్మె 27వ రోజూ కొనసాగింది. సమ్మెకు సిపిఎం మండల కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఉద్యమ నిధికి రూ.వెయ్యి అందించారు. అనంతరం ప్రదర్శనగా ప్రధానసెంటర్‌కు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. అక్కడ ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ మండల నాయకులు కోన జయమ్మ, ఆర్.రామలక్ష్మి, సిఐటియు జిల్లా నేత నారపల్లి రమణరావు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, సుభాషిణి, వెంకటలక్ష్మి, కెవి.సత్యవతి, రబియా, కుమారి, సబీనా, అరుణ, పార్వతి నాయకత్వం వహించారు

బుట్టాయగూడెం : మండలంలోని అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి తహశీల్దార్ కార్యాలయం నుండి నెహ్రూ సెంటర్ వరకూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ 27 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయకుండా ఎస్మాతో అణచాలని చూడటం అన్యాయమన్నారు. అంగన్వాడీలను బెదిరించాలనుకోవడం అవివేకమన్నారు. ప్రభుత్వం కుట్రలు చేసినా ప్రభుత్వం దిగొచ్చేవరకూ సమ్మెను విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పార్వతీ, లలిత, కృపామణి, పుష్ప, మారమ్మ, సుజాత, రామలక్ష్మి పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలో అంగన్వాడీల సమ్మె 27వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్మా కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీలు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ, పద్మ, మణి, రిబ్కా పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో అంగన్వాడీల సమ్మె 27వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్మా చట్ట కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జిఒ కాపీలను, నోటీసులను దహనం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు.

ముసునూరు : అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించటం బాధాకరమని అంగన్వాడీల యూనియన్ నూజివీడు ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి ఆవేదనవ్యక్తం చేశారు. ముసునూరు సచివాలయం వద్ద సమ్మె 27వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కలపాల విద్యావతి, దుర్గ, మేరీ సులోచన, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, విజయలక్ష్మి, సుజాత, అలివేలు, మంగ, వెంకటరమణ పాల్గొన్నారు.

మండవల్లి : బెదిరించినా, ఒత్తిళ్లకు పాల్పడినా వెనక్కితగ్గేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరింది. ఐద్వా జిల్లా నేత ఎ.శ్యామలారాణి శిబిరం వద్దకు చేరుకుని అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు చెల్లమ్మ, వాణి, ఉమాదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

19వ రోజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద ఆదివారం నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తాననే వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, ఝాన్సీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య, సందీప్, దిలీప్ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



నారాయణపురంలో పెన్షన్లు అందిస్తున్న వైసిపి మండల కన్వీనర్ మంగారావు


పెన్షన్ల పెంపు చారిత్రాత్మకం

వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సామాజిక పెన్షన్ల పెంపు చారిత్రాత్మకమని వైకాపా మండల కమిటీ కన్వీనర్ మరడ వెంకట మంగారావు అన్నారు. శనివారం నారాయణపురంలో పెంచిన పెన్షన్లను ఇంటింటా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగారావు మాట్లాడుతూ మండలంలో కొత్తగా 153 పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రతి లబ్ధిదారునికి రూ.3 వేలు పింఛను అందించడం అందరి ఇళ్లలో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొందన్నారు. ఆయన వెంట ఉంగుటూరు ఎఎంసి మాజీ ఛైర్మన్ రమావతి, ఎంపిటిసి సభ్యులు అరివెల్లి మహాలక్ష్మి ధనయ్య, సచివాలయం-2 కన్వీనర్ సీపాని శివబాలు, వార్డు సభ్యులు పైడి వెంకటలక్ష్మి, వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు వర్షప్రసాద్, వాలంటీర్ రమావతి పాల్గొన్నారు.

ముసునూరు : నూతన పింఛన్లు పంపిణీ చేయడంతో పెంచిన పింఛన్లను పొందిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎంతో ఉత్సాహం చూపుతున్నారని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. ఆదివారం మండలంలోని లోపూడి గ్రామ సర్పంచి పేరం కృష్ణ ఆధ్వర్యంలో పెంచిన పింఛన్లు రూ.3 వేలను వాలంటీర్ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అందజేశారు.



ముసునూరులో

కుటుంబంలోని వక్తిని కోల్పోవడం బాధాకరం

మోరు రాజ వర్ధన్ వర్ధంతి సభలో ఎంఎల్ఎ, ఎంఎల్‌సి

ప్రజాశక్తి - మండవల్లి

మరణం సంభవించి కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు, ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని ఇంగిలిపాక లంకలో నిర్వహించిన కీర్తిశేషులు మోరు రాజ వర్ధన్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆదివారం వారు పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణం కుటుంబంలో విషాదాన్ని మిగులుస్తుందని అన్నారు. అంతేకాకుండా చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడం తల్లిదండ్రులకు తీరని లోటన్నారు. రాజ వర్ధన్ జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోవాలని వారి తల్లిదండ్రులు కుమారుడి మీద ఉన్న ప్రేమతో ప్రజలకు సేవ చేసే విధంగా వాటర్ ట్యాంకును, పాదాచారులు సేద తీరే విధంగా సిమెంట్ కుర్చీలను, బెంచిలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వాటర్ ట్యాంక్‌ను, కుర్చీలను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు ముంగర విజయనిర్మల, ఎఎంసి ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బేతపూడి మెండ సురేష్, ఘంటసాల సంపత్ రాజు మోరు అంజయ్య పాల్గొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

ఎక్స్‌పర్ట్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో పెదవేగి మండలం శింగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులందరికీ ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా మందులు, టూత్‌పేస్టులు పంపిణీ చేశారు. తన ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన డాక్టర్ శ్రీహర్షకి ఉపాధ్యాయురాలు జి.నీలిమ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ మండలంలో ఉన్న మిగతా పాఠశాలల నిర్వాహకులు కోరితే వారి విద్యార్థులకు కూడా వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ టి.సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టివి.పద్మావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేగ నియంత్రికల ఏర్పాటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

భద్రతా ప్రమాణాలలో భాగంగా రహదారి ప్రమాదాలు నివారించుటకు ఆగిరిపల్లి మండలంలో బ్లాక్ స్పాట్స్(ప్రమాదాలు జరుగు ప్రదేశాలు) గుర్తించి ప్రమాదాలు అరికట్టుటకై రేడియం స్టిక్కరింగ్‌లతో డ్రమ్ములను (వేగ నియంత్రికలు) ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, నూజివీడు డిఎస్‌పి ఇ.అశోక్ కుమార్‌గౌడ్ పర్యవేక్షణలో, నూజివీడు రూరల్ సిఐ బాల సురేష్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు, సిబ్బంది ఆదివారం ఏర్పాటు చేశారు.

నేరాలు – ఘోరాలు

కోడి పందేలపై దాడి : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు బైకులు, రూ.3 వేల నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కోడి పందేలు, పేకాటలు ఎవరైనా నిర్వహిస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

రూ.4,900 స్వాధీనం

పెదపాడు : పెదపాడు మండలం వెంపాడు, కొక్కిరపాడు గ్రామాల్లో ఎస్ఐ చల్లా కృష్ణకి రాబడిన సమాచారం ప్రకారం తన సిబ్బందిని తీసుకొని ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,900 నగదు స్వాధీనపరచుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లుగా పెదపాడు ఎస్ఐ తెలియజేశారు.

రోగులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం

వైద్యం కోసం రోగుల అగచాట్లు

ప్రభుత్వ ఆదేశాలు భే ఖాతరు

24 గంటలు ఆసుపత్రిగా కొనసాగని వైనం

కాసుల ముసుగులో పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రికి వైద్యులు వస్తారా? వచ్చినా.. వైద్య సేవలు అందిస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొందని రోగులు స్పష్టం చేస్తున్నారు. 24 గంటలు రోగులకు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం ఆదేశించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, నేటికి ఆవిధంగా చర్యలు చేపట్టలేదంటే రోగులకు వైద్యం అందించడంలో వైద్యుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందనేది తేటతెల్లం చేస్తుందని రోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీంతో కైకలూరు నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు 24 గంటలు వైద్యం అందిస్తుండగా మండవల్లిలో 24 గంటల వైద్య సేవలు అందకపోవడంపై అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని రోగులు ప్రశ్నిస్తున్నారు. కాసుల ముసుగులో అధికారులు మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చూసి చూడనట్లు వ్యవహరిస్తూ దృష్టి సారించకపోవడంతో రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని రోగులు, ప్రజలు స్పష్టం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా రోగులు వైద్యం కోసం ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మండవల్లి పిహెచ్‌సి భవనం

రోగులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా వైద్యాన్ని మరింత బలోపేతం చేసింది. ఈ నేపథ్యంలోనే ఆరోగ్యశ్రీని 25 లక్షలకు పెంచడంతో పాటు విలేజ్ హెల్త్ క్లీనిక్లను, ఫ్యామిలీ డాక్టర్ అనే కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తుంది. అంతేకాకుండా రెండు సంవత్సరాల క్రితమే పిహెచ్‌సిలను 24 గంటలు వైద్యశాలలుగా మార్చి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే విధంగా సిబ్బందిని నియమించింది. అయినప్పటికీ మండవల్లి పిహెచ్‌సిలో వైద్యుల నిర్లక్ష్యంతో ప్రభుత్వం ఆశించినంత రీతిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు. ఇక్కడ వైద్యులు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ 24 గంటలు వైద్యం అందించకపోగా అసలు ఆసుపత్రిలో ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొందని రోగులు స్పష్టం చేస్తున్నారు. వైద్యులు ఆసుపత్రికి వచ్చినా పని ఉంది బయటికి వెళ్లాలని మందు బిళ్లలు ఇచ్చి పంపమని నర్సులకు చెప్పి వెళ్లిపోతున్నారే తప్ప నేటికీ ఒక్కరోజు కూడా రోగులను ఆప్యాయంగా పలకరించి, పరీక్షించిన పాపన పోలేదని రోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రోగులకు సకాలంలో 24 గంటలు వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని అప్పటి జిల్లా వైద్యాధికారి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన లేదని వివరిస్తున్నారు. దీంతో మండవల్లి పిహెచ్‌సిలో అసలు 24 గంటలు రోగులకు వైద్య సేవలు అందించడం సాధ్యపడుతుందా, జిల్లా అధికారులు ఆ విధంగా సాహసించి రోగులకు వైద్యం అందించేలా చేయగలరా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు కాసులకు కక్కుర్తి పడి ఆరోగ్య కేంద్రాన్ని పర్యవేక్షించకపోవడంలో విఫలమై, వైద్యులపై చర్యలు తీసుకోకపోవడంతో సాయంత్రం ఆరు లేదా ఏడు గంటలకే సిబ్బంది వైద్యశాలను మూసేసి వెళ్లిపోతున్నారని, దీంతో రాత్రి వేళల్లో అనారోగ్య సమస్యలు తలెత్తి దూర ప్రాంతంలో ఉన్న ప్రయివేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి 24 గంటలు వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌పై చర్యలు తీసుకుని, రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. దీనిపై జిల్లా వైద్య అధికారిని శర్మిష్టాను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆమె సెలవులపై వెళ్లారని ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారని సిసి బసవరాజు తెలిపారు.


రోగులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే



డాక్టర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండక రోగులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. రోగులకు వైద్యం అందించకపోగా వైద్యులు చులకనగా చూస్తున్నట్లు రోగులు నా దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

టి.అప్పారావు, ఐక్యవేదిక మండల అధ్యక్షులు

రోగులను పట్టించుకోరు



నాకే బాగోక ఆసుపత్రికి వెళ్లాను. అప్పటికే రోగులు డాక్టర్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈలోపు డాక్టర్ వచ్చి మందు బిళ్లలు ఇచ్చి పంపించండని నర్సులకు చెప్పి వెళ్లిపోతుంది. ఏంటి మేడం అని ఆమెను అడిగాను. నీకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని వెళ్లిపోయింది. దీంతో నేను సిఎంఒ కార్యాలయానికి ఫిర్యాదు చేశాను. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

బండి రంగారావు, గ్రామ ప్రముఖులు

మా దృష్టికి వచ్చింది



ఆసుపత్రిలో వైద్య సేవలు అందడం లేదని రోగులు మా దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా అధికారులకు స్పందనలో విజ్ఞప్తి చేశాం. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని మళ్లీ వారం రోజులు గడువు అడిగారు, గడువు పూర్తయిన ఆ ఊసే లేదు.

ఎల్ఎస్ భాస్కర్ రావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి

మోకాళ్లపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన

13వ రోజు సమ్మె - నేడు కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వం మొండి వైఖరిగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, చర్చల పేరుతో కాలయాపన చేస్తుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్మికులు నగర పంచాయతీ కార్యాలయం ముందు మోకాళ్లపై రోడ్డుకు అడ్డంగా నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు కనీస వేతనాలు అమలు చేయాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టి.విజయరాజు, జి.నాగరాజు, వి.పద్మ, వల్లి, కె.నాగరాజు, ఎం.సత్యనారాయణ, మనోహర్, మధు, శివ, ఈశ్వర్, పద్మ, దేవసహాయం పాల్గొన్నారు.



చింతలపూడిలో రోడ్డుకు అడ్డంగా నిలబడి నిరసన తెల్పుతున్న కార్మికులు


ఏలూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్‌లు, స్కిల్డ్, సెమి స్కిల్డ్ జీతాలు, క్లాప్ ఆటోల డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 చెల్లించాలని, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాను బాబు డిమాండ్ చేశారు. 13వ రోజు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఆదివారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు సామూహిక ప్రార్ధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జాన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం అమలు చేయకుండా కార్మికులను రోడ్డు పాలు చేయడం అన్యాయమని అన్నారు. అమలు కాని వాగ్దానాలు చేసి కార్మికులను మోసగించడం సరైంది కాదన్నారు. ప్రభువా.. ఈ పాలకులకు మంచి బుద్ధిని ప్రసాదించి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని



ఏలూరులోని సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సోమయ్య

ఆయన కోరారు. అనంతరం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మూడు దఫాలు చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించడంలో మొండిగా వ్యవహరిస్తుందన్నారు. శనివారం రాత్రి మంత్రుల కమిటీతో జరిగిన చర్చల సారాంశాన్ని ఆయన వివరించారు. ఇంజనీరింగ్ కార్మికులకు ఒక్క రూపాయి కూడా పెంచనని ప్రభుత్వం భీష్మించి కూర్చోవడం దుర్మార్గమన్నారు. పిఆర్‌సి కనుగుణంగా కనీస వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమ్మె పరిష్కారం కోసం సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 8న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కార్మికులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సామూహిక ప్రార్ధన కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వరరావు, నాగరాజు, జార్జి, గోపి, దుర్గ, పాప, మరియమ్మ, అర్లప్ప, గణేష్, గంగాధరు నాయకత్వం వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ దీక్షలకు మద్దతు తెలిపారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలో మున్సిపల్ ఆఫీసు వద్ద మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎన్ఆర్ హనుమాన్లు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.రాజు, మున్సిపల్ కార్మిక నాయకురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.



బాలునికి సహాయం చేస్తున్న ఎంఎల్ఎ నాని

చిన్నారికి అండగా ఆళ్ల నాని

అనారోగ్యానికి గురైన బాలునికి వికలాంగుల పెన్షన్ మంజూరు

గతంలో బాలుని వైద్య నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఒసి అందజేత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు 31వ డివిజన్‌కు చెందిన బండ్లమూడి కోటేశ్వరరావు, లక్ష్మీతులసిల కుమారుడు బండ్లమూడి దుర్గా జయాన్ష్ అనారోగ్యానికి గురి కాగా ఆ బాలుని వైద్య చికిత్స నిమిత్తం ఎంఎల్ఎ ఆళ్ల నాని గతంలో సుమారు రూ.5 లక్షల మేర సిఎం ఆర్ఎఫ్ ఎల్‌ఒసి అందజేశారు. అనంతరం బాబుకు క్రమంగా కంటి చూపు మందగించడంతో ఈనెలలో వికలాంగుల పెన్షన్ మంజూరు చేశారు. ఈ మేరకు ఆళ్ల నాని చేతుల మీదుగా కొత్తగా మంజూరైన పెన్షన్ అందచేశారు. తమకు అన్ని విధాలా అండగా నిలిచిన ఆళ్ల నానికి బాలుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణరావు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి : బేతపూడి

ప్రజాశక్తి - ముదినేపల్లి



పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా గెలిపించాలని వైసిపి సీనియర్ నేత, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు బేతపూడి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు జగనన్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జగనన్న చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి ప్రత్యర్థి రాజకీయ పార్టీలు జగన్‌పై కక్ష గట్టి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజల మేలు కోసం సిఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు దళితులంతా ఐక్యంగా ఉండి జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. మరోసారి వైసిపి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఈ సంవత్సరం ఎన్నికల ఏడాది సిఎం జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత వైసిపి నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. దళితులంతా మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే దళితుల జీవితాల్లో వెలుగులు విరాజిల్లుతాయన్నారు. వైసిపిని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ప్రజా నాయకుడు మోహన్ రంగ : వంగవీటి రాధా

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న రాధాకృష్ణ


ప్రజా నాయకుడు వంగవీటి మోహన్ రంగ అని ఆయన తనయుడు మాజీ ఎంఎల్ఎ వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని తిరుమల దేవిపేట గ్రామంలో వంగవీటి యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రంగ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఛైర్మన్ కరాటం రాంబాబు, కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాధ రావు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ..

1995-96 బ్యాచ్ ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - మండవల్లి

అరే మామ ఎన్నాళ్లైందిరా నిన్ను చూసి, ఎలా ఉన్నావ్ రా.. ఏమే ఎలా ఉన్నావు.. నీ పిల్లలు ఎంత పెద్ద వాళ్లు అయ్యారే అనే ఆప్యాయపు పలకరింపులతో మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హోరెత్తింది. 1995-96 పదవ తరగతి పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. దీంతో పాఠశాల పూర్వపు విద్యార్థులతో నిండిపోయింది. చాన్నాళ్ల తర్వాత పూర్వపు విద్యార్థులు కలుసుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడి చేశారు. మాస్టర్ గారు హిందీ సరిగ్గా చదవడం లేదని, రాయడం లేదని నన్ను బెత్తంతో చాలాసార్లు కొట్టారు.. గుర్తుందా మాస్టర్ అంటూ ఆనాడు చదువు చెప్పిన ఉపాధ్యాయున్ని పాదాభివందనం చేసుకోగా ఆ ఉపాధ్యాయుడు గుర్తుచేసుకొని ఆ వ్యక్తిని కౌగిలించుకొని ఎలా ఉన్నావురా బడుద్దాయి అని పూర్వ విద్యార్థిని కౌగిలించుకున్నాడు. దీంతో పూర్వపు విద్యార్థులంతా ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలతో, దృశ్యాలు వాళ్లతో ఘనంగా సత్కరించి సంతోషపడ్డారు. అనంతరం సహబంతి భోజనం నిర్వహించారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు



సత్యనారాయణను సత్కరిస్తున్న పెద్దలు

ప్రతిఒక్కరూ సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మానవ సేవే మాధవ సేవా అనే దృక్పథంతో ప్రతి ఒక్కరూ కృషి చేసి సమాజంలో సామాజిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరి కుమార్ యాదవ్ అన్నారు. గుడివాడలోని క్రమ సత్రంలో ఆదివారం దాకరం పిఎసిఎస్ ఛైర్మన్ సోమ సత్యనారాయణకు సత్కార సభ నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సేవ సంఘం ఆధ్వర్యంలో 2023 సంవత్సరంలో వివిధ సేవా కార్యక్రమాలు చేసినందుకు శ్రీకృష్ణ యాదవ సేవ సంఘం సత్కార సభ ఏర్పాటు చేసి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పల్లెల్లో పలు సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కటారి రామ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మరాజు

'యువతే జనసేనకు వెన్నుముక'

ప్రజాశక్తి - ఉంగుటూరు

అన్ని పార్టీల కంటే యువత జనసేనలోనే ఎక్కువగా వున్నారని ఉంగుటూరు జనసేన ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. ఆదివారం నారాయణపురం జనసేన కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ సమావేశం జరిగింది. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ధర్మరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా ద్వారా పవన్ కళ్యాణ్ సేవలను, పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెవెళ్లాలని అన్నారు. సోషల్ మీడియా ద్వారా మెరుగైన సమాచారాన్ని తీసుకెళ్లాలని, పార్టీ సింబల్ గాజు గ్లాస్ గుర్తును ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గం ఐటి వింగ్ కోఆర్డినేటర్ అయితం ప్రసాద్, గ్రామ స్థాయి కోఆర్డినేటర్లు జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

భూ సిఫార్సులు అమలు చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు అమలు చేయడంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు. టి.నరసాపురం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సర్వే నెంబరు 668లోని 5773.11 ఎకరాల రిజర్వు ఫారెస్ట్ భూమిని సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి తాడిగడప జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దున్నేవానిదే భూమి అనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికే దక్కుతుందన్నారు. సమ సమాజ స్థాపనకు వ్యవసాయ కార్మిక సంఘం ఆవిర్భవించిందన్నారు. పేదలు ఆత్మ గౌరవంతో బ్రతకాలంటే భూ పంపిణీ జరగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించడానికి ఏర్పాటు చేసిన ఉపాధి హామీ చట్టాన్ని మోడీ నీరుగార్చుతున్నారని విమర్శించారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు 200 రోజులు పని దినాలు కల్పించి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమె బాల యేసు, సిపిఐ చింతలపూడి మండలం కార్యదర్శి కంచర్ల గుర్వయ్య పాల్గొన్నారు.

నూజివీడులో చిన్నం పర్యటన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మాజీ ఎంఎల్ఎ డాక్టర్ చిన్నం రామకోటయ్య మండలంలోని వెంకటాయపాలెంలో ఆదివారం పర్యటించారు. మాజీ సర్పంచి బాణావతి గోపియాను కలిశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు తెలిపి, తనను బలపరచాలని గ్రామస్తులను కోరారు. చిన్నం విజయానికి కృషి చేస్తామని గ్రామస్తులు హామీ ఇచ్చినట్లు రామకోటయ్య తెలిపారు.

గ్రామోత్సవానికి అడ్డంకులెన్నో..!

ద్వారకా తిరుమల : రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయం ద్వారకాతిరుమలలో స్వామివారు ముఖ్యమైన పర్వదినములలో గ్రామోత్సవాలకు గ్రామ పురవీధులగుండా పయనిస్తూ భక్తులకు, గ్రామస్తులకు దర్శనమిస్తూ వుంటారు. స్వామివారు గ్రామోత్సవం జరిగే మార్గంలో మాంసం దుకాణాలు ఉండటం వల్ల పురోహితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మాంసం వ్యర్థాలతో ఆ ప్రదేశం దుర్గంధం రావడంతో పురోహితులు మాస్కులు ధరించి, ఇబ్బంది పడుతూ త్వరితగతిన ముందుకు సాగిపోతున్నారు. ధనుర్మాసం సందర్భంగా నెలరోజుల పాటు స్వామివారి గ్రామోత్సవం ప్రతినిత్యం సంక్రాంతి పండుగ వరకు జరుగుతుంది. పంచాయతీ వారు స్వామివారి గ్రామోత్సవం జరిగే మార్గంలో పరి శుభ్రత ఏర్పాట్లు చేసి, చెత్తాచెదారంలో లేకుండా, మాంసం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.